

# వెంటాడే పిలుపు

రాజమణి చీకట్లో ఒంటరిగా కూచుంది... వెలుతుర్లోకి రావాలంటే భయం...

ఎప్పుడూ చీకట్లోనే వుండాలన్నా భయం...

బతుకుంతా భయం భయం...

భవిష్యత్తు మరీ భయం...

వెనకా ముందూ ఎవరూలేని ఒంటరితనం... తనతోడు పంచుకునే వాడు... నీడనిస్తాడనుకున్నవాడు... అర్థవంతమవుతుందనుకున్న జీవితాన్ని చాలించి అర్థాంతరంగా వెళ్ళిపోయాడు.

ఆ మూణ్ణెళ్ళ సంసారంలో కడుపులో ఓ నలుసైనా పడితే...

ఆ బిడ్డలో తననీ, తండ్రినీ, చూసుకుంటూనైనా బతికేది. ఈ భయంకరమైన ఒంటరి తనానికి అడ్డుకట్టవేసేది.

ఆలోచనల్లో వుండగానే.. ఇంటిముందు 'అంబా' అన్న అరుపు... ఆ అరుపు మూడేళ్ళుగా చిరపరిచితమే... పోతురాజు వచ్చాడనుకుంది.

బకెట్లో వున్న కుడితి నీళ్ళలో నిన్న మిగిలిపోయిన అన్నం, ఈ రోజు వంపిన గంజి కలిపి బకెట్ తీసుకొచ్చి... ఇంటిముందు నిల్చున్న దున్నపోతు ముందుంచింది.

అది ఆబగా జుర్రుతుంటే... గమనించింది. ఈ మధ్య ఎవరూ కుడితినీళ్ళు పెట్టక బక్క చిక్కుతోంది.

మూడేళ్ళకింద అది వూర్లోకొచ్చినప్పుడు... ఆడపిల్లలమంతా ముసిముసిగా నవ్వుకున్నాము.

ఆరోజు వాగు దగ్గరికి మంచినీళ్ల బిందెలు పట్టుకొని తను, సుజాత, సంధ్య, ఉమ, లక్ష్మి తామంతా వెళ్తుంటే... గ్రామ పంచాయితీ రచ్చబండ మీద వూరి రైతులంతా పంచాయితీ జరుపుతుంటే ఆగిపోయాం. విషయం తెల్సుకున్న తర్వాత ఎంతగా నవ్వుకున్నామో... అనుకుంది రాజమణి.

కానీ... 'పాడినే నమ్ముకున్న రైతులకి అదెంతటికీ తీరని సమస్య?

"వూర్లో బర్రెలు ఏవీ కూడా రెండేళ్లనించీ సూడికి రావటం లేదు. అందరం కల్సి బర్రెల మీద పారడానికి దున్నపోతుని కొనాలి, మీరేమంటారు?" సర్పంచ్ అడిగాడు.

"వూరి మీదికి దున్నపోతుని కొనాలని ఎన్నాళ్ళనించో మొత్తుకుంటున్నాం. వూర్లో ఇంతమందిమి రైతులముండి, అందరికీ బర్రెలుండి... పాలు పెరుగు పక్కూరి వాళ్ళనించి కొనుక్కోవటం సిగ్గనిపిస్తుంది." ఓ మోతుబరి రైతు గట్టిగానే అన్నాడు.

"మంచి పోతుని కొనాలంటే ఆదివారం జగిత్యాల అంగట్లకు బోవాలె. కనీసం వెయ్యి, రెండువేల లోపుది కొంటేనే... మన బర్రెలేమన్నా సూడికత్తయ్ మరి. అంత డబ్బు గ్రామ పంచాయితీలకెల్లి తీయటం కుదర్దు కాబట్టి... రైతులంతా తలా ఇంతని వేస్కోవాలి..." తిరిగి చెప్పాడు సర్పంచ్.

"అందరు రైతులు ఎలా వేస్తాం... బర్రెయున్న ఇంటికి ఇంతని వేయాలి" అన్నాడు మరోరైతు.

"అదీ కరక్టే... అందరికీ ఎట్లా వేస్తారు? ఎవలెవలకు బర్రెలున్నాయో చెప్పరాదుండ్రి లిస్టు రాద్దాం" అన్నాడు ఉపసర్పంచి.

పావుగంటలో పేర్లు తయారయ్యాయి.

"అది సరే... అంతమంచిగనే వున్నది కాని... దానికి మేత ఎట్లామరి?" సందేహంగా అడిగాడో రైతు.

"నీయవ్వ... పోతుకొన్నంక తనుగుకి భయపడతామె రాజన్నా... ఇంటికెంత

కుడితి నీళ్ళో, చలిబువ్వో పడేత్తే... ఊరిమీద పడి అదే ఊరుతది" అన్నాడు వెంకన్న అనే రైతు.

"సరే... ఎల్లుండి ఆదివారం జగిత్యాల అంగట్లకు ఎవలెవలు వోతరు?" అనడిగాడు సర్పంచి. ఇద్దరు యువ రైతులు "మేం పోతంలే" అన్నారు.

"అంగడంత మంచిగా తిరిగి... బేరం చేయుండ్రి. అంగడికి దగ్గరని సీరామ టాకీసుల సీన్మాజూసి బక్కపోతుని తెచ్చేరు" నవ్వుతూ హెచ్చరించాడు మరో రైతు.

వూరంతా కల్సి దున్నపోతు కొనడానికి ఏకగ్రీవ తీర్మానం చేసారు.

ఆ పంచాయితీని విచిత్రంగా ఖాళీ బిందెలు పట్టుకొని నిల్చుండి చూస్తున్న ఆడపిల్లల్ని చూడగానే... కింద వేసుకున్న పంచెదులుపుతూ లేచిన రంగయ్య తాత...

"ఇగ గీ పెయ్య దూడలకు... మంచి పోతుల్ని చూడాలే" అన్నాడు సరసంగా.

"గా పోతులు వెయ్యి రెండు వేలల్ల దొరుకుతాయే... లచ్చలకు లచ్చలు గావాల్నాయె" నవ్వుతూ అన్నాడు మరో రైతు.

ఆ మాటలు విని "ఛీ తాతా... పోయే..." అంటూ బిందెలతో వాగువైపు పరిగెత్తారంతా.

తర్వాత...

నాల్రోజులకి... నల్లగా, ధృడంగా నిగనిగలాడుతూ వచ్చిన దున్నపోతుని చూసి అంతా ముచ్చటపడి దానికి 'పోతురాజు' అని పేరు పెట్టారు.

కాలం కరిగిపోతూనే వుంది... ఏడాదిలో బర్రెలు సూడికొచ్చాయి.

ఊర్లో పుష్కలంగా పాడి దొరుకుతోంది.

అనాటి ఆడపిల్లలందరికీ కూడా ఈ మూడేళ్ళలో పెళ్ళిళ్ళయ్యాయి.

కాని రాజమణి బతుకే పెళ్ళయిన మూణ్ణేళ్ళకే చితికి పోయింది. భర్త యాక్సిడెంటులో చనిపోయాడు.

పోతురాజు కుడితి తాగి అంబా అని అరవటంతో రాజమణి ఈ లోకంలోకి వచ్చి పడింది. ఇప్పుడు దాన్ని వూర్లో ఎవరూ పట్టించుకోవట్లేదు. ఆకలితో ఎవరి చేన్లోనైనా పడితే 'దొంగగొడ్డు' అని తిడుతున్నారు, కొడుతున్నారు.

దాంతో అది బాగా చిక్కిపోయింది.

xxx xxx xxx

రాజమణి అంతరాంతరాల్లో మొదలైన సంఘర్షణ... సుడిగుండమై సుళ్ళు తిరుగుతూ గుండెను అతలాకుతలం చేస్తోంది.

ఈ ఒంటరితనాన్ని జయించడానికి...

నిండారుగా నవ్వడానికి...

నింపాదిగా ఆడుకోవడానికి...

నిలువెల్లా పులకరించడానికి...

తనకో... బిడ్డ కావాలి!

తనకో బిడ్డ కావాలి !"

మగాడి తోడు అవసరం లేదు... అమ్మతనంలోని ఆత్మీయతని అల్లుకొని వచ్చి... బుడి బుడి నడకలతో ముద్దాడి... తను ప్రతిక్షణం పలవరించేలా... తనని

పలకరించేలా... ఈ బ్రతుకుని సంతోషంగా వెళ్ళదీయడానికి...

తనకో బిడ్డ కావాలి !!!

నెలరోజులుగా పడుతున్న మధనంతో... భయం, పరువు పోటీపడుతున్నాయి. తనెవరకీ ద్రోహం చేయ్యటంలేదు. ఆమాత్రం ఆనందాన్నయినా తన జీవితంలో నింపుకుంటే తప్పేంటి? ఈ ఒంటరి జీవితంలోకి.. ఆ వెలుగు ఎలా రావాలి? ఎలా? ఎలా??

ఆమె ఆలోచనల్లో వుండగానే 'రాజమణీ... రాజమణీ... కొంచెం అన్నం పెట్టవూ...' అంటూ వినాయకులు వచ్చాడు. వాడికి వయసూ, శరీరం పెరిగినా మనసు ఎదగలేదు. దాన్ని అవకాశంగా తీసుకున్న రాజమణి వినాయకులుకి కడుపారా అన్నంపెట్టి... అల్లుకు పోయింది.

అప్పుడే రాజమణి ఇంట్లోకి వచ్చిన అనసూయ అయ్యో... అయ్యో... అని మొత్తుకుంది. కేకలు వేసింది. బిలబిలా ఆడమగా అంతా పరుగెత్తుకొచ్చారు.

"వినాయకులు గాడు అమాయకుడనుకున్నాం... రాజమణి మీద పడ్డాడు" అంది.

అంతే! వినాయకుల్ని కొట్టారు, తన్నారు, రాజమణి మూగవోయి నిల్చుంది వినాయకులు అరుపులు విన్లేని రాజమణి 'ఆగండే' అని అరచింది.

అప్పటికే వినాయకుడి ఒళ్ళు హూనమైంది.

"వినాయకుడి మీద నేనే పడ్డాను" అంది తలదించుకొని

ఆ తర్వాత గంటకి... రాజమణి పంచాయితీలో పెద్దల ముందు నిల్చుంది.

రకరకాల మాటలు... నిలువెల్లా చీల్చాయి.

చివరగా... రాజమణి తప్పుకి అయిదు వందల జరిమానా విధించారు.

xxx xxx xxx

రాజమణి అవమానంతో కుంగిపోయి ఇంట్లోకి అడుగుపెడుతుంటే... మణీ అని పిలిచింది సుజాత. సుజాతని చూడగానే బావురుమంది. వాళ్ళిద్దరూ చిన్నప్పట్నించీ స్నేహితులు.

"నీ బాధని నేనర్థం చేసుకోగలనే... నేను మాయింటికి గోదావరిఖని వెళ్తున్నాను. వారి పదిరోజులు మా ఇంట్లో వుండివద్దువు గాని... రా..." అంది ఆప్యాయంగా.

కన్నీళ్ళతో 'సరే' నని తలూపింది రాజమణి.

xxx xxx xxx

పదిరోజుల తర్వాత గోదావరిఖని నించి వచ్చిన రాజమణికి... మళ్ళీ ఒంటరితనం ఆవరించింది. దుఃఖం పెకిలించుకొని కన్నీళ్లు రావడానికి మూగవోయిన గుండె మౌనంగా రోదిస్తోంది. సాయంత్రం కాగానే.... ఎప్పటిలాగే 'అంబా' అన్న పిలుపు కోసం చూసింది.

ఆ రోజు చీకటిపడినా 'పోతురాజు' రాలేదు.

ఆరోజే కాదు... రెండు మూడు రోజుల వరకూ ఆ పిలుపు విన్లేదు. ఎవరి చేనులోనైనా పడితే బంజరుదొడ్డిలో కట్టేసి వుంటారనుకొంది.

రంగయ్య తాత కనపడి పలకరిస్తే "తాతా... పోతురాజు కన్పడటం

లేదేంటి? ". అనడిగింది.

"దానికి మేతవేసే వాళ్లెవరు తల్లీ... తిండి దొరక్క అది బక్కగొడ్డులా అయింది. దాని మెడ దగ్గర పుండయి ఈగలు ముసిరితే... ఇంటి ముందుకు రాగానే చీదరించుకొంటూ తరిమేవాళ్ళు. దాంతోని ఊరోల్లంతా కల్సి రెండొందలకు 'కోత'కి అమ్మేసారు. రజాక్‌గాడు దాన్ని కొని అల్‌కబీర్‌కు పట్టుకుపోయిండు. ఈ మనుషులింతే తల్లి... గొడ్డుకో న్యాయం... మనిషికో న్యాయం... ఏరు దాటంగానే తెప్పతగిలెయ్యటం...." అంటూ వెళ్ళిపోయాడు. రాజమణి కూలబడిపోయింది. కాలం ఒంటరిగా అల్లుకుపోతోంది.

అంబా అన్న పిలుపుకోసం....

అమ్మా అన్న పిలుపు కోసం...

రాజమణి రోజూ ఎదిరి చూస్తోంది.

ఆ పిలుపులు... అనుక్షణం ఆమెని వెంటాడుతున్నాయి.

*